# అందిన ద్రాక్ష పళ్ళూ పుల్లనే...

అరిపిరాల సువర్ణ

“ఒరేయ్ వరుణ్... ఆటోవాడు వచ్చేశాడు... స్కూలుకు రెడీ అయ్యావా లేదా...? ఆ...! వంటింట్లో అట్లు పోస్తూ అడిగింది అహల్య... హడావిడిగా ముందర గదిలోకి తొంగి చూసింది.

అక్కడ... కూతురు శోభ కాలేజీకి వెళ్లేందుకు తయారవుతోంది... షూ వేసుకుంటున్న వరుణ్ ఏడుపు మొహం పెట్టుకు వేసుకుంటున్నాడు.

“ఇదేమిటమ్మా... షూ పాలిష్ అయిపోయిందని నాలుగు రోజుల నుంచే చెప్తున్నాను... ఇంతవరకూ బజారు నుంచి పాలిష్ కొనుక్కు రానేలేదు...” అన్నాడు ముక్కు ఎగబీలుస్తూ.

“అందుకు ఏడవడం ఎందుకురా...? ఇవ్వాళ మరిచిపోకుండా కొనుక్కొస్తాగా బజారు కెళ్లి...” అని కొడుక్కు చెప్పిన అహల్య మొగుడితో... ఏమండోయ్ శ్రీవారూ ఆఫీసుకెళ్లే ముందు మరచిపోకుండా ఓ వెయ్యి రూపాయలు నా హాండ్‌బాగ్‌లో పెట్టి వెళ్లండి.

పళ్లెంలోంచి దోస ముక్క తుంచి నోట్లో



పెట్టుకోబోతున్న చంద్రమౌళి చెయ్యి అలాగే స్తంభించిపోయింది.

"అయ్యో...! ఒక చిన్న డబ్బా షూ పాలిష్ కొనడానికి వెయ్యి రూపాయిలే...! అమ్మ బాబో య్...!" అంది శోభ తన గుండ్రటి కళ్లను గుండ్రంగా తిప్పుతూ...

"బాగానే ఉంది చోద్యం! బజారు కంటూ వెడితే ఒక్క షూ పాలిష్ మాత్రమేనా కొనుక్కొస్తాను...? ఇంటికి కావాల్సిన ఉప్పు పప్పులతో పాటు ఇంకా కావాల్సినవి కూడా కొనుక్కొస్తాను... అని సమాధానం చెప్పిన తల్లిని తల్చుకుంటూ శోభ "ఇవ్వాళ నాన్నగారి పర్సుకు గండే... పాపం నాన్న...!" అని తండ్రి మీద జాలి పడింది.

శోభ అనుకున్నంతా జరిగింది సాయంత్రం కాలేజీ నుంచి ఇంటికి వచ్చేటప్పటికి...!

హాలు మధ్యనున్న టీపాయ్ మీద చిన్న, పెద్ద అన్నీ రకరకాల పాకెట్లు పరిచి ఉన్నాయ్... వంటింట్లోంచే కూతుర్ని చూసి హాలులోకి వచ్చిన అహల్య... వుసేయ్ శోబీ ముందరీ సల్వార్ కమీజ్ వేసుకు చూసి నీకు బాగున్నదీ లేనిదీ చెప్పు...

ఐంద్రజాలికుడు మంత్రం వేసి సంచిలోంచి పక్షిని బయటకు తీసినట్లుగా తల్లి పెద్ద కాగితం కవరు లోంచి బయటకు తీసిన గార్డెన్ మిల్లు లేత ఆకాశం రంగులోని సల్వార్ కమీజు ఎంతో అందంగా ఉన్నప్పటికీ ఇంటి నిండా కావలసినన్ని డ్రస్‌లుండగా మళ్లీ మరోటి కొనడం అనవసర ఖర్చు అనిపించింది శోభకు... అదే అన్నది కూడా...

"అమ్మా నాకు బీరువా నిండుగా డ్రస్‌లుంటే మళ్లీ మరో కొత్త డ్రస్ ఎందుకు కొనుక్కొచ్చావమ్మా...? అనవసరంగా డబ్బు వేస్ట్...?"

"చాల్లే ఊరుకో, నీకేంతెలీదు... కొత్తగా ఓపెన్ చేసిన రెడీమేడ్ బట్టల షాపులో పైన వేళ్లాడదీశారు కళ్లు మిరిమిట్లు కొలిపేట్టుగా... నా మనసాగలేదు... నీకొకటి కొనాలనిపించింది... కొనుక్కొచ్చాను... అందరూ మార్కెట్‌లో కొచ్చిన ప్రతీ డ్రస్ కొనమని తల్లిదండ్రులను వేధించుకుతింటూంటే నువ్వేమిటే కొనుక్కొస్తే 'ఎందుకు వృధా ఖర్చు అంటావు...?" అని తనను శ్లాఘించుకున్న అహల్య... అదలా ఉంచు... దీన్ని చూడు... చూశావంటే ఆశ్చర్యంతో నోరుతెరుస్తావు..." అంటూనే అహల్య ఓ మాదిరి సైజు పాకెట్ విప్పేసరికి, అందులోంచి మూడు అరలున్న చిన్న టిఫిన్ కేరియర్ తళతళలాడుతూ బయటకొచ్చింది.

'కింది భాగం వెడల్పుగా, పైన చిన్నదిగా గోపురకలశంలా ఉన్న ఆ బుల్లి కేరియర్ నిజంగా కొత్తదనంతో ముద్దొస్తున్నదనడంలో ఎంత మాత్రం అతిశయం లేదు... అయినా ఈ టిఫిన్ కేరియర్‌తో అమ్మ ఏం చేయాలనుకుంటున్నది...?'

"ఎలా ఉందని అడుగుతూంటే ఏం చెప్పవేమిటే శోభీ...? నోరు తెరిచి చెప్పవే...?"

"చాలా బాగుంది కానీ... దీన్నెందుకు కొనుక్కొచ్చావనేదే నాకు తెలీడంలేదు..." అన్న కూతుర్ని కోపంగా చూసింది అహల్య.

"నీకక్కర లేదంటే పోనీ, వరుణ్ రోజుకో రకం కేరియర్‌లో అన్నం పెట్టుకెడతాడు..." అన్నది తన నిరుత్సాహాన్ని బయటకు చూపించకుండా...!

"ఆ... ఆ... ఆశలు పెట్టుకోవద్దు... ఆ బకాసురుడికి కూరకి కూడా చాలదీ కేరియర్..." ఎగతాళిగా అన్నది శోభ.

"అవునమ్మా... ఈ పెద్ద పార్సిలేమిటి? బాగా బరువుగా ఉన్నట్లుంది...?" అడుగుతూనే పాకెట్ పట్టుకునే సరికి అది తెరుచుకుని అందు లోంచి మూడు షిఫాన్ చీరలు కిందపడ్డాయ్.

"మన చందనాబ్రదర్స్‌లో ఆషాఢమాసం డిస్కౌంట్ సేల్స్ వేశారు. ఇంట్లో రోజూ కట్టుడు కుంటాయని ఓ మూడు చీరలు కొన్నాను చౌక గా..." అని సంతోషంతో ఉత్సాహంగా చెప్తున్న తల్లిని నిరుత్సాహపరచడం ఇష్టం లేని కూతు రు, "ఓ... ఫెంటాస్టిక్... చాలా బాగున్నాయి" అని మెచ్చుకుంది.

రెండు నెలలు గడిచిపోయాయి... ఆ రోజు సాయంత్రం ఇంటికొచ్చిన చంద్రమౌళి ఇంట్లో భార్య కనిపించక విసుగనిపించింది.

"అమ్మ కనిపించదేంరా వరుణ్...?" కొడు కునడిగాడు.

"అమ్మ స్నేహితురాలు బృందా ఆంటీ ఇం ట్లో ఏదో ఫంక్షనుట... వెళ్లింది... ఎనిమిది గంటలలోగా వచ్చేస్తానన్నది..." అని వరుణ్ ఇంకా చెప్తూండగానే వాకిట్లో ఆటో వచ్చి ఆగింది.

"ఆ పెట్టె జాగ్రత్తగా దింపి లోపలకు తీసు కురండి..." అని అహల్య ఆజ్ఞాపించింది.

అది మోసుకొస్తున్న ఆటో వాడికి డబ్బు లిచ్చి పంపించిన అహల్య మొహం మూడు చందమామలలోని వెన్నెలంతా కలిసి ప్రకాశి స్తున్నంతగా వెలిగిపోతోంది.

"ఇదేమిటి అహల్యా...?"

"పెట్టెపైన ఫుడ్ ప్రోసెసర్ అని రాసుంది నాన్నగారూ... మన మిక్సీ మాదిరిగానే పెద్ద దిగా ఫొటో కూడా వేశారుగా...!"

పెట్టెలోంచి ఆ సాధనాన్ని అతి జాగ్రత్తగా బయటకు తీసి వంటింటి తిన్నె మీద పెట్టి దాని అందాన్ని చూసి మురిసిపోతున్నది అహల్య.

"ఏమండీ చూడడానికే ఎంత బాగుందో చూశారా...? ఇది రొట్టెలకు, పూరీలకు గోధు మపిండి కలుపుతుంది... కారెట్, కాబేజీ, కాలీ ఫ్లవర్, ఉల్లిపాయలు అన్నీ తరుగుతుంది. సం త్రా, బత్తాయి, అనాసపళ్ల రసాలన్నీ తీస్తుంది. కొబ్బరి తురుముతుంది, పిండి పాలు తీస్తుం ది... ఇంకా... ఇంకా ఎన్నో అద్భుతమైన పను లన్నీ చేస్తుంది" అని గుక్క తిప్పుకోకుండా భార్య చెప్పిన మాటలకు నవ్వాలో ఏడవాలో తెలీలేదు మౌళికి... ఇలాగే ఎవరో చెప్పారని శాండ్‌విచ్ మేకర్‌ని కొన్నది లాస్ట్ ఇయర్. కొన్న కొత్తలో వరసగా నాలుగైదు రోజులు బ్రెడ్ కొని శాండ్ విచ్ చేయడంతో సరి... అదిగో అలమారలో ఆ మూల పడుకుని మూలుగుతోంది.

అంతకుముందు వాక్యూమ్ క్లీనర్ కొన్న ది... కొనేతీరాలన్న మొండి పట్టు పట్టి. నాలు గు వేలు పోసి కొనిపించింది... ఒక నెల ఏం వాడిందో అంతే... "గానుగలోని రోకలిలా ఈ బరువుని మోసుకెళ్లే కంటే చీపురుతో ఊడ్చు కోవడమే హాయి" అని దాన్ని అటకెక్కించింది.

"ఇదిగో ఇప్పుడీ ఫుడ్ ప్రోసెసరు...! దీని మోహం ఎన్నాళ్లో...? ఆ పుట్టించిన బ్రహ్మ దేముడికే తెలియాలి.

"అమ్మా, కొబ్బరి పాలు మన పాత గ్రైండరే బ్రహ్మాండంగా పిండి ఇస్తోందిగా...? రొట్టెలకు, పూరీలకు గోధుమపిండి రెండే నిముషాలలో తడపచ్చునుగా...! మన నలుగురి వంటకు ఎన్ని కూరలు తరగాలి...? అందుకు రకరకాల కత్తు లు, కత్తి పీటలూ ఇంట్లో ఉండనే ఉన్నాయిగా అమ్మా... మళ్లీ ఈ మిషను మీద ఇంత డబ్బు ఎందుకమ్మా అనవసరంగా ఖర్చు చేశావు...?" అన్న కూతురు మాటలకు బాగా కోపం వచ్చి

ఇంతెత్తున ఎగిరింది.

"చాల్లే నోరుముయ్యవే, నీకేం తెలుసు దీని మహాత్యం? నీకు తెలీక అంటున్నావు... ముందు ముందు నీకే తెలుస్తుంది.

ఆ... ఆ... మూల పడుకుంటుంది మౌళి మనసులోనే విసుక్కున్నాడు.

*　*　*

"హాయ్ అహల్యా... ఎలా ఉన్నావే...? చాలా రోజులైందే నిన్ను చూసి..." ఫుట్‌పాత్‌ల మీద రకరకాల పింగాణీ సామాన్లు పెట్టుకుని, "ఏ అయిదు సామాన్లు కొన్నా పాతికే రూపాయలు" అని అరుస్తున్న వాడి దగ్గరున్న సామాన్లలో ఏం కొనాలా అని ఆలోచిస్తూ నిల్చున్న అహల్య భుజం మీద చెయ్యిపడడంతో వెనక్కి తిరిగింది అహల్య.

అక్కడ... కనిపించింది అహల్య బాల్య స్నేహితురాలు రమ.

"ఏయ్ రమీ... ఎలా ఉన్నావే... ఎన్ని సంవత్సరాలైందే నిన్ను చూసి... నాకెంతో ఆశ్చర్యంగా ఉందే నిన్నిలా చూసేసరికి! అన్న అహల్య స్నేహితురాల్ని కౌగలించుకున్న కౌగిలిలో ప్రేమాభిమానాలున్నాయి.

"సరే... సరే... మా ఇల్లు ఇక్కడికి దగ్గరే వెడదాం పద..." అని అహల్యను చెయ్యి పట్టుకు లాక్కెళ్లింది రమ వాళ్లింటికి.

నీట్‌గాను, పొందికగానూ, అందం గానూ ఉంది రమ ఇల్లు.

ముందున్న హాలులో వచ్చిన అతిధులు కూర్చునేందుకని సింపుల్‌గా ఓ సోఫాసెట్టు, ఒక టీపాయ్ ఉన్నాయి... హాలు మూలగా స్టాండ్ మీద టి.వి. అందంగా అమర్చబడి ఉంది... బెడ్‌రూములో కాని, పిల్లల స్టడీ రూములో కానీ ఏ విధమైన ఆడంబరాల అడ్డాలూ లేవు. సింపుల్‌గా ఉన్నాయి.

"మొట్టమొదటిసారిగా మా ఇంటికొచ్చావు... భోజనం చేసే వెళ్లాలి..." అని మర్యాద చేసి కూర్చోపెట్టింది అహల్యను.

స్నేహితురాలి మాటను కాదనలేక ఆమెతో వంటింట్లోకి వెళ్లిన అహల్య వంటింటిని చూసి ఆశ్చర్యపోయింది... ఇంత ఖచ్చితంగా కిచెన్‌ని ఉంచుకోవడం సాధ్యపడుతుందా...? అక్కడ... వంటకు కావల్సిన అవసరమైనంత సామాను, పరికరాలు మాత్రమే ఉన్నాయి.

గ్రైండర్, మిక్సీ, గాస్ స్టౌ, కుక్కర్ వంటి అత్యవసర సామాను అక్కడ అందంగా అమర్చి ఉన్నాయి... వంట చేయడానికి కావల్సిన గిన్నెలు మాత్రమే అలమారలో పేర్చి ఉన్నాయి... వెంటనే అహల్యకు తమ వంటింట్లో అడ్డదిడ్డంగా పడున్న అక్కరలేని సామానంతా కళ్లముందు కనిపించింది.

అంతలో నిమ్మకాయ షర్బతు చేసి గాజు గ్లాసులో పోసి తన చేతికిచ్చి, రొట్టెలకు గోధుమ పిండి తడుపుతున్నది రమ.

"రమా నువ్వు వెజిటబుల్ కటర్, రోటీ మేకర్, పిండి తడిపేది, జ్యూస్‌లు చేసే ఫుడ్ ప్రోసెసర్‌లాంటి వేవీ కొనుక్కోలేదా...?" అని అడిగిన అహల్యను చిరునవ్వుతో చూసింది.

"ప్చ్...! అవన్నీ అనవసరమే అహల్యా..." మనింట్లో పది మందికి వండి పెట్టాలా ఏమిటి...? ఉన్నది ముగ్గురో నలుగురో...! అలా కొన్నా కొత్త ఓ వింత పాత ఓ రోత అన్నట్లుగా కొత్త మోజులో నాలుగు రోజులు వాడతాము. ఆ తరువాత మూల పారేస్తాము... మళ్లీ ఆ పాత కత్తిపీట, కత్తులే వాడతాము... అలాంటప్పుడు బోలెడు డబ్బు పోసి ఆ సామాన్లు కొనడం అనవసరం అనిపించింది... అందుకే కొనలేదు.

నిజం... నిజం... అది నిజం అని అహల్య మనస్సాక్షి ఘోష పెట్టింది... ఏవేవో అక్కరలేని అనవసర సామాన్ల మీద మనసు పడి, మన కది కావాలా అక్కరలేదా అని ఆలోచించకుండా బోలెడంత డబ్బు పోసి కొని, ఇల్లంతా నింపింది తను. ఏవీ ఉపయోగించకుండా మూల పడేసింది.

ఆ... అవును... ఇది ఎంతో ఉపయోగం అని పందెం వేసి కొన్నది రెండు వారాలకే దాని మోజు తీరిపోయింది. ఆ ఆధునిక మిషన్లు పాడైతే విడి భాగాలు దొరకడం కష్టం. ఫుడ్ ప్రోసెసర్ ఉపయోగించే ముందు కంటైనర్స్ అమర్చడం, వాడాక విప్పి వాటిని శుభ్రం చేయడం ఓ పెద్దపని... అవన్నీ పూర్తి చేసేసరికి ఎక్కడ లేని నీరసం వచ్చేస్తుంది. పైగా 'వద్దు వద్దంటున్నా వినకుండా కొన్నందుకు భర్తకు, పిల్లలకూ సంజాయిషీ చెప్పుకోవాల్సి వస్తుందని బలవంతంగా వాటిని వాడుతోంది' అప్పుడప్పుడూ.

"ఏమిటి అహల్యా అలా సైలెంట్ అయిపోయావు...? రా భోజనం చేద్దాం... వడ్డించేశాను..." అని రమ అభిమానంగా పిల్చేసరికి పెద్ద నిట్టూర్పు వదులుతూ డైనింగ్ టేబుల్‌కు నడిచింది అహల్య.

"ఇంటిని అత్యద్భుతంగా మెయిన్‌టెయిన్ చేస్తున్నావు రమా..." గుత్తివంకాయ కూర రుచి చూస్తూ అన్న అహల్య "ఇంకా చెప్పాలంటే అనవసరమైన సామాన్లేవీ కొనకుండా ఇంటినెంతో విశాలంగా ఉంచుకున్నావు.... అదెలా సాధ్యపడిందే రమా నీకు...?"

"ఏం... ఎందుకు సాధ్యపడదు...? అహల్యా...? షాపింగ్‌కని బయలుదేరే ముందే అవసరం లేని వేవీ కొనను అని మనసులో నిర్ణయించుకుంటాను... ఏదైనా చూస్తే కొనాలన్న చపలత్వం కలిగితే "ఛా...ఛా... ఇది ఏం బాగుండలేదు. మనింట్లో ఎందుకూ ఉపయోగ పడదు... అందని ద్రాక్షపళ్లను చూసి నక్క ఛీ... ఛీ... ఈ పళ్లు పులుపు అనుకున్నట్లుగా అనుకుంటాను. అంతే... ఆ పైన అది కొనాలనే అనిపించదు..."

భోజనం చేసి స్నేహితురాలికి వీడ్కోలు చెప్పి ఇంటికి బయలుదేరిన అహల్య దారిలో డిస్కౌంట్ సేల్ అన్నబోర్డుతో పాటు ఆమెకు అతి ఇష్టమైన బచ్చల పండు రంగుచీర షోకేసులో బొమ్మకట్టుకునుండడం చూసింది. మామూలుగా అయితే వెంటనే షాపులో కెళ్లి బొమ్మకు కట్టిన చీరను విప్పదీయించి కొనుక్కు తెచ్చుకునేది... ఇప్పుడామె ఆలోచనలలో మార్పు వచ్చింది.

అందని దాక్ష పళ్లను చూసి నక్క అనుకున్నట్లుగా... అందని ద్రాక్షపళ్లే కాదు... అందిన ద్రాక్షపళ్లు కూడా పుల్లగా ఉండొచ్చు. తనకు కొనగల శక్తి ఉన్నప్పటికీ అవి ఎంతవరకూ అవసరం అనే ఆలోచన చేయలేకపోయింది ఇంతవరకూ. ఆలోచనా విధానంలో మార్పురాగానే ఛీ... ఛీ... ఈ రంగేం బాగుండలేదు అనుకుంటూ వడివడిగా ఇంటివైపుకు అడుగులేసింది అహల్య... ●

### నేనే... నాన్నని...

"మా అబ్బాయికి ఒంట్లో బావుండలేదు – ఈ రోజు స్కూలుకి రాడు" హెడ్మాస్టర్‌తో ఫోన్‌లో చెప్పాడు అవతలి వ్యక్తి.

ఇంతకూ మీరెవరు?

నేనే... మా నాన్నని మాట్లాడుతున్నా... టక్కున సమాధానం వచ్చింది.